సాక్షి నిర్మల్

సోమవారం, 30, డిసెంబర్, 2024

సెలవంటూ వెళ్లిపోయారు..!



సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన బొద్దుటూరి నర్సారెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారు. గత జనవరిలో తుదిశ్వాస విడిచారు. 8లో▸



కోనో మొత్తానికే వద్దమ్మో..!

జిల్లా కేంద్రంలో రోడ్డు డివైడర్ మధ్య పెట్టిన కోనో కార్పస్ చెట్లు ప్రజారోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. దీంతో వీటిని తీసేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం

31.0 / 18.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి కాస్త తగ్గుతుంది. ఆకాశం పాక్షికంగా, పలుచోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



పతకాలతో విద్యార్థులు

సోన్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి యోగా, కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని అభ్యాస గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. యోగాలో రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్‌కుమార్ తెలిపారు. కరాటే పోటీల్లో ఆరు బంగారు, ఎనిమిది వెండి, రెండు కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను యోగా, కరాటే మాస్టర్లు చరణ్, చిరంజీవి, నర్సయ్యను హెచ్‌ఎం, సిబ్బంది అభినందించారు.

జిల్లా జట్టుకు సిల్వర్ మెడల్



సిల్వర్ మెడల్ సాధించిన జిల్లా జట్టు

నిర్మల్‌టౌన్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారని జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అత్యపత్య అండర్–17 బాలికల ఫైనల్స్‌లో సంగారెడ్డి–నిర్మల్ జట్లు తలపడగా.. 18–17 పాయింట్స్‌తో సంగారెడ్డి విజయం సాధించింది. నిర్మల్ జట్టు రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. అలాగే హైదరాబాద్‌లోని జీఎంసీబీ కాంప్లెక్స్‌లో ఈనెల 27 నుంచి 29వరకు నిర్వహించిన కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పీహెచ్ నక్షత్ర 55 కేజీల విభాగంలో వెండి పతకం, పీ సుగంధ 46 కేజీల విభాగంలో కాంస్య పతకం, జీ మానిక 65 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారు. వీరిని జిల్లా క్రీడల అధికారి అభినందించారు.


అడెల్లిలో భక్తుల సందడి



పూజలు చేస్తున్న సీసీఎఫ్ ప్రభాకర్ దంపతులు

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రమేశ్, ఎస్సై భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో రామకృష్ణారావు, అనిత, నజీర్‌ఖాన్, స్వప్న, వెన్నెల తదితరులున్నారు.

రూ.10కే కిలో టమాట



కుంటాల సంతలో టమాటాలు

కుంటాల: వారం క్రితం రూ.30నుంచి రూ.40 పలికిన కిలో టమాట ధర అమాంతం పడిపోయింది. మండల కేంద్రంలోని సంతలో ఆదివారం కిలో రూ.10కే విక్రయించారు. ధర పడిపోవడంతో వినియోగదారులు సంబుర పడుతుండగా.. టమాట సాగు చేసిన రైతులు నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

కడెంలో పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ పరిసరాల్లో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేశారు. వనభోజనాలు చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

ఏడాదిలో ఎన్నెన్నో..

2024.. చూస్తుండగానే కాలగమనంలో చివరిదశకు చేరింది. ఈ ఏడాది ప్రారంభమవుతూనే జిల్లాకు కొత్త ఎస్పీని తీసుకొచ్చింది. కొన్నినెలల్లోనే కలెక్టర్‌నూ మార్చేసింది. జిల్లాలో ఎన్నో మార్పులు, చేర్పులు చేసుకుంటూ, యూబిట్ దందా తదితర ఘటనలతో రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశమైంది. ఎక్కడో తిప్పేశ్వర్ అడవుల నుంచి 'జానీ' అనే పులి ఆడతోడు కోసం వాకింగ్ చేస్తూ జిల్లా అంతా చుట్టేసి వెళ్లింది. ఇలా ఎన్నో సంఘటనల సమాహారాన్ని 2024 మిగులుస్తూ.. వెళ్లిపోయేందుకు సిద్ధమవుతోంది. పలు ముఖ్యమైన అంశాలపై 'ఇయర్ రౌండప్'.. – నిర్మల్



- జిల్లాకు కొత్త ఎస్పీ, కలెక్టర్
- 'కడెం'.. ఎత్తిపోతలకు నిధులు
- ప్రాణం తీసిన ఫుడ్‌పాయిజన్
- జిల్లాను చుట్టి వెళ్లిన 'జానీ'

వరుసగా ఘటనలు ఇలా..

- ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ బదిలీ కాగా, కొత్త ఎస్పీగా జీ జానకీషర్మిల వచ్చారు.
- అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది. వాడవాడలా సీతారాముల కల్యాణాలు జరిపించారు. భోజనాలు ఏర్పాటు చేశారు.
- జిల్లా మీదుగా రైల్వేలైన్ తీసుకువస్తామని బాండ్‌పేపర్ రాసిచ్చినవాళ్లకే ఓటేస్తామని జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో వివిధ సంఘాల ప్రతినిధులు స్పష్టంచేశారు.
- మహిళా సమన్వయ వేదిక ఆధ్వర్యంలో నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 'నారీశక్తి' సమ్మేళనానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది మహిళలు హాజరయ్యారు.
- ఎన్నడూ లేనంతగా మార్చి 28వ తేదీన దస్తురాబాద్ మండలకేంద్రంలో అత్యధికంగా 43.1 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- నర్సాపూర్(జీ) కేజీబీవీలో జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనలో దాదాపు 63మంది విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ ఆస్పత్రిలో 39, నర్సాపూర్‌లో 23 మంది చికిత్స పొందారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో ఒకరిని నిజామాబాద్ తరలించారు.
- పార్లమెంట్ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లాలో 71శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ కామారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా నూతన కలెక్టర్‌గా జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ నియమితులయ్యారు.
- కొత్త న్యాయ (భారత న్యాయసంహిత) చట్టాల అమలు ప్రారంభమైంది. లక్ష్మణచాంద మండలానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందడంతో తొలి కేసు నమోదు చేశారు.
- యూబిట్ కాయిన్‌దందాపై పోలీసుల చర్యలు ప్రారంభించారు. జిల్లాలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.
- వర్షాలు, వరదల నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు జిల్లాలో పర్యటించారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డితో కలిసి జిల్లాకేంద్రంలోని జీఎన్ఆర్ ముంపుకాలనీని పరిశీలించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం మంత్రి బీజేఎల్పీనేత ఇంట్లో భోజనం చేయడం చర్చనీయాంశమైంది.
- జిల్లాకేంద్రానికి చెందిన గైనకాలజిస్ట్ చంద్రిక మిసెస్ వరల్డ్ పోటీల్లో శాంతికిరీటాన్ని గెలుచుకున్నారు. గురుగావ్‌లో నిర్వహించిన పోటీల్లో 'మిసెస్ వరల్డ్ పీస్'తో పాటు 'మిసెస్ ఇంటలెక్చువల్' సబ్‌టైటిల్ దక్కించుకున్నారు.
- జానీ అనే పేరుగల ఈ పెద్దపులి సారంగపూర్, కుంటాల, కుభీర్, దిలావర్‌పూర్, నిర్మల్‌రూరల్, మామడ, ఖానాపూర్, పెంబి, కడెం మండలాల్లో సంచరిస్తూ పలు పశువులను చంపేసింది.
- నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి నిలిచిపోయిన టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.80కోట్లను విడుదల చేయాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరారు.
- డీఆర్వో భుజంగరావు ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు.
- జిల్లాకేంద్రంలోని గ్రిల్–నైన్ హోటల్‌లో ఫుడ్‌పాయిజన్ అయ్యింది. ఇక్కడ భోజనం చేసిన వారిలో చాలామంది అస్వస్థతకు గురయ్యారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో ఓ స్కూల్‌లో పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఫూల్‌కాలీబైగా అనే యువతి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందడం సంచలనమైంది.
- మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మీదుగా సారంగపూర్ మండలంలో పెద్దపులి అడుగుపెట్టింది. ప్రజలను ఆందోళనకు గురి చేసింది.
- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. నూతన డీఈవోగా నిజామాబాద్ విద్యాశాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న నాగజ్యోతి నియమితులయ్యారు. ఆమె కూడా బాధ్యతలు చేపట్టలేదు. చివరకు రామారావును డీఈవోగా నియమించారు.
- ఆత్మహత్యలు లేని ట్రిపుల్‌ఐటీగా మార్చేందుకు ఆర్జీయూకేటీని దత్తత తీసుకుంటున్నట్లు ఎస్పీ జానకీషర్మిల ప్రకటించారు.
- తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది నిరవధిక సమ్మె ప్రారంభించారు. ప్రతిరోజూ తీరొక్క నిరసనలు చేపడుతున్నారు.

ఆశ-నిరాశ..

- రెండేళ్లుగా భారీ వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు మరమ్మతులకు ఈఏడాది రూ.9.26 కోట్లు వచ్చాయి. తాజాగా పూడికతీత కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన నాలుగు ప్రాజెక్టుల్లో జిల్లా నుంచి కడెం కూడా ఉండటం విశేషం.
- గతేడాది వర్షాలతో కొట్టుకుపోయిన సిరాల ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.10కోట్లు మంజూరయ్యాయి.
- పిప్రి ఎత్తిపోతల పథకానికి రూ.10కోట్లు, కనకాపూర్ ఎత్తిపోతల మరమ్మతుకు రూ.కోటి 40లక్షలు ఇచ్చారు. నిర్మల్ పట్టణానికి అమృత్ పథకం కింద రూ.63కోట్లు మంజూరయ్యాయి.
- గతేడాది ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని 27ప్యాకేజీ నీటి ఎత్తిపోతలు ఆ ఒక్కరోజుకే పరిమితం కావడం శోచనీయం. 28వ ప్యాకేజీ కనీసం అడుగు కూడా ముందుకు పడలేదు.
- జిల్లాలో గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఒకేరోజు 5,940 ఇంకుడుగుంతలను నిర్మించి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించారు.
- స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడంలో వరుసగా మూడోసారి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలిచి అవార్డు అందుకుంది.
- సమీకృత సాగు విధానాన్ని విజయవంతంగా అమలు చేసి చూపినందున పెప్సీకో సంస్థ నుంచి జాతీయస్థాయిలో డీఆర్డీవో విజయలక్ష్మి, మహిళా సమాఖ్య కేంద్రమంత్రుల చేతుల మీదుగా ప్రథమ పురస్కారాన్ని అందుకున్నారు.
- ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో ఇటిక్యాల ఫీల్డ్ అసిస్టెంట్ వినాయక్, వెంకంపోచంపాడ్ ఉపాధి కూలీ చవాన్ మహేశ్ ఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ నిర్వహించిన మేధోమథన సదస్సులో పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర ఉద్యోగుల సమ్మె

నిర్మల్ రూరల్: ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలు, పేద విద్యార్థులకు బోధిస్తున్న తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. విద్యాశాఖలో అంకితభావంతో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 20 ఏళ్లుగా విద్యావ్యవస్థకు వెన్నెముకగా నిలిచామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. వెట్టి చాకిరీ, శ్రమ దోపిడీ నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేంద్రాచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు విజయకుమార్ దీక్షాశిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు మద్దతు తెలిపారు. నాయకులు గంగాధర్, నరేశ్, గజేందర్, వాణి, రాము, ప్రమోద్, తిరుమల, నవిత, ఆనంద్, గంగాధర్, అజయ్, రవీందర్, మతిన్, లతాదేవి, జ్యోతి, వీణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



పోతన్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

సోన్: విజయవాడ కేంద్రంగా ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, కవి, రచయిత కొండూరు పోతన్న పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే పద్యాలు ఆలపించారు. సాహితీ సదస్సులో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పి, పద్య రచన మెళకువలను యువకవులకు తెలిపారు. తెలుగు సాహిత్యాభివృద్ధికి పలు సూచనలు చేశారు. దీంతో పోతన్నను నిర్వాహకులు అభినందించారు. ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, సాహితీ అభిమానులు పోతన్నకు అభినందనలు తెలిపారు.

అత్యవసర సేవలెలా?

- అమ్మ చెంత భక్తుల అవస్థలు
- బాసరలో రెస్క్యూటీం జాడేది?
- పెద్దాస్పత్రి లేక తప్పని ఇక్కట్లు
- కానరాని ఫైరింజన్ సౌకర్యం



బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం

భైంసా: దేశంలోనే ప్రసిద్ధిగాంచిన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో అత్యవసర సేవలు కరువయ్యాయి. ఈ ఆలయానికి దేశ నలుమూలల నుంచి భక్తులు నిత్యం వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తారు. గంగమ్మకు మొక్కు తీర్చుకుంటారు. నామకరణాలు, పుట్టువెంచలు, శుభకార్యాలెన్నో ఇక్కడ జరుపుకొంటారు. రాష్ట్రంలో ఏకైక ట్రిపుల్ ఐటీ ఇక్కడే ఉండటంతో తొమ్మిది వేల మంది విద్యార్థులు ఇక్కడి విద్యనభ్యసిస్తున్నారు. మండల కేంద్రం కావడంతో చుట్టు పక్కల పల్లె జనం బాసరకు వస్తారు. వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తుండగా నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ అత్యవసర సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

అగ్ని ప్రమాదాలు సంభవిస్తే..

బాసర మండలంలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేదు. ప్రమాదాలు సంభవిస్తే భైంసా నుంచే అగ్నిమాపక శకటం ఇక్కడికి పంపిస్తారు. ముఖ్య పర్వదినాల్లో భైంసా నుంచే శకటాన్ని తీసుకువచ్చి సేవలకు సిద్ధంగా ఉంచుతారు. ప్రతీసారి ఏదైన ప్రమాదం సంభవిస్తే క్షణాల్లో వచ్చే అగ్నిమాపక శకటం బాసరలో మాత్రం అందుబాటులో లేదు. ప్రమాదాలు సంభవించిన సమయంలో భైంసా నుంచి లేదంటే నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్ నుంచి ఇక్కడికి పంపిస్తున్నారు. ప్రసిద్ధ ఆలయమున్న బాసరలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

100 పడకల ఆస్పత్రి నిర్మించాలని..

భైంసా పట్టణంలోలాగే బాసరలోనూ 100 పడకల ఆస్పత్రి నిర్మించాలని ఎన్నో రోజులుగా ఈ ప్రాంత వాసులు విన్నవిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రి ఉంటే ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, బాసర మండల వాసులు, ఆలయానికి వచ్చే భక్తులు, రైల్వే యాత్రికులకు నిరంతరం వైద్యసేవలు అందుతాయి. ఆపద సమయంలో అత్యవసర సేవలు అందితే ఎంతోమంది ప్రాణాలు కాపాడే పరిస్థితి ఉంటుంది. బాసర ఆలయ విశిష్టత పెరుగుతున్నా అత్యవసర సేవలపై దృష్టిపెట్టడంలేదన్న ఆరోపణలు నిత్యం వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బాసర ప్రముఖ పుణ్యక్షేత్రం. బాసరను కలుపుతూ ధర్మాబాద్ మీదుగా నాందేడ్ వరకు, బిలోలిని కలుపుతూ దెగ్లూర్ వరకు, భైంసా పట్టణం గుండా నిర్మల్–లక్సెట్టిపేటనూ కలుపుతూ హైవేలున్నాయి. ఇక బాసర మీదుగా నిజామాబాద్‌కు ప్రధానరోడ్డు మార్గం ఉంది. తాజాగా బోధన్ పట్టణం మీదుగా జహీరాబాద్, మెదక్‌ను కలుపుతూ హైదరాబాద్ వరకు మరో హైవే నిర్మాణంలో ఉంది. ఇన్ని ప్రధాన రహదారులను కలిపే బాసరలో అత్యవసర సేవలపై దృష్టి పెట్టాలని భక్తులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వైద్యం, రక్షణ అంతంతే..

రోడ్డు ప్రమాదాలు జరిగినా.. పాముకాటుకు గురైనా.. స్నానఘట్టాలపై భక్తులు జారిపడ్డా.. రైల్వే ప్లాట్‌ఫాంపై కిందపడ్డా.. ఇక్కడ వైద్యసేవలు అందుబాటులో లేవు. బాసరలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మాత్రమే ఉంది. దీని స్థాయిని పెంచడం లేదు. ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, బాసర మండల వాసులు, భక్తులకు ఈ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సేవలు అందడంలేదు. ఇక్కడ జరిగే ప్రమాద ఘటనలపై ఎస్పీ జానకీషర్మిల స్పందించారు. ఇటీవలే భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్‌తో కలిసి ఇక్కడి పరిస్థితిని తెలుసుకున్నారు. గోదావరి నదికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిత్యం పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రమాదవశాత్తు గోదావరినదిలో పడ్డవారి ప్రాణాలు కాపాడే ప్రయత్నాలు ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లావైపు నుంచి బాసరవైపు వచ్చే మార్గాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలని ఆదేశించారు. బాసరలో రెస్క్యూటీం అవసరమున్నా ఇప్పటికీ నియమించలేదు. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా ఒక్క అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. గతంలో బాసర యువకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి సమస్య తెలిపితే అంబులెన్స్ మంజూరు చేయించారు. కానీ.. నాలుగు నెలలు తిరగకుండానే వైద్యాధికారులు ఆస్పత్రి నుంచి దానిని వేరే ప్రాంతానికి తీసుకువెళ్లారు. అత్యవసర సమయాల్లో 108కు సమాచారం ఇస్తే దూర ప్రాంతాల నుంచి బాసరకు అంబులెన్స్ సకాలంలో చేరుకునే పరిస్థితి లేదు.



బాసర గోదావరి నది



బాసర రైల్వేస్టేషన్

కనులపండువగా కూడారై మహోత్సవం



ఉత్సవమూర్తులతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



ఉత్సవంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలోగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడారై మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయమే భక్తులు అధికసంఖ్యలో రాగా, అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే విష్ణు సహస్ర నామ స్తోత్రం, తిరుప్పావై పారాయణం, లక్ష్మీవేంకటేశ్వర అష్టోత్తర శతనామార్చన, నివేదన, హారతి, మంగళ శాసనం కార్యక్రమాలు జరిపారు. అనంతరం అమ్మవార్ల సమేత స్వామివారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో స్థానిక ధనంజయ్ ఫ్యాక్టరీ వరకు పాటలు, నృత్యాల మధ్య తీసుకెళ్లారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే పురాణాబజార్‌లో మార్వాడి సంఘం ఆధ్వర్యంలోనూ ధర్మశాలలో కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు.

హరితహారం చెట్ల నరికివేత..!



పట్టణంలో నరికివేతకు గురైన చెట్లు

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రధాన రహదారి వెంబడి మున్సిపల్ ఆధ్వర్యంలో పెంచిన హరితహారం చెట్లు ఆదివారం నరికివేతకు గురయ్యాయి. స్థానిక ఐబీ ప్రాంతం, దర్శన్ లాడ్జి ఎదుట రోడ్డు వెంబడి కొన్నిచెట్లు నరికివేశారు. కొన్నింటికి కొమ్మలు తొలగించగా, మరికొన్నింటిని మొదళ్ల వరకు నరికేశారు. ఈ విషయమై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్‌ను వివరణ కోరగా, చెట్లు నరికివేసిన మాట వాస్తవమేనని తెలిపారు. కానీ, ఎవరు చేశారో తెలియదని పేర్కొన్నారు. విషయం కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన పెయింటింగ్ శిక్షణ శిబిరం



తాము గీసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో అధికారులు

బాసర: ఆర్జీయూకేటీ బాసర హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల పెయింటింగ్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. సుమారు 60 మంది విద్యార్థులు హాజరు కాగా, సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన ప్రముఖ కళాకారుడు ధనలకోట నాగేశ్వరరావు, సాయికిరణ్ శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వీసీ, ప్రొఫెసర్ గోవర్ధన్ అభినందించారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ నాగరాజు, డాక్టర్ రాకేశ్‌రెడ్డి, బద్రి నారాయణ, నాగలక్ష్మి, మహబూబ్, విజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రపంచ తెలుగు మహాసభల్లో మనోళ్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో రాజమల్లు



ప్రశంసాపత్రం, మెమొంటోతో మహేందర్

చెన్నూర్: విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ఆరో ప్రపంచ తెలుగు మహాసభల్లో మంచిర్యాల జిల్లా చెన్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, రచయిత దబ్బెట రాజమల్లు, మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ ప్రతిభ కనబర్చారు. సాహితీ సదస్సులో పాల్గొని తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజమల్లు, మహేందర్‌ను ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటోలతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్: సీఎం కప్ జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీఎం కప్ తైక్వాండో ఎంపిక పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా పేరును అగ్రభాగాన నిలపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, తైక్వాండో జిల్లా ఇన్‌చార్జి అన్నారపు వీరేశ్, రాష్ట్ర టెక్నికల్ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, సీనియర్ పీడీ హరిచరణ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివప్రసాద్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం



ఇందల్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ఉరేసుకుని ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆడె ఇందల్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శనివారం ఆదిలాబాద్‌లో చికిత్స చేయించుకున్నాడు. రాత్రి కావడంతో ఉట్నూర్‌లో ఉన్న తన సోదరుడు సంజీవ్ ఇంటికి వెళ్లాడు. నొప్పి అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వాతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

లింగాపూర్: విషయం తెలుసుకున్న రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ మృతుని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించాడు.

జీవన వైవిధ్యం.. ప్రాణహితం

మదిని మైమరిపించే ప్రకృతి అందాలు.. జన జీవనానికి ఉపాధి నిచ్చే అవకాశాలు.. జీవాలకు ప్రాణం పోసే వనరులు.. ఇవన్నీ కలిసిన ప్రాంతం ప్రాణహిత నదీ తీరం. అబ్బురపరిచే అరుదైన దృశ్యాలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామ సమీపంలోని ప్రాణహిత తీరం నిలయంగా ఉంది.

– చింతలమానెపల్లి/బెజ్జూర్

- సహజ సౌందర్యం
- జన జీవనోపాధికి నిలయం
- తలాయి వద్ద అరుదైన అందాలు
- పర్యాటక అభివృద్ధికి అవకాశాలు



కశ్మీర్ దాల్ లేక్ కాదు.. తలాయి తీరం



నదీ తీరంలో జీవనం సాగిస్తున్న కుటుంబం

సహజ సౌందర్యం..

ప్రాణహిత నది సహజ సౌందర్యానికి నిలయం. ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం. విశాలమైన ఇసుకమేటలు...తీరంలో మొక్కజొన్న చేలు.. నదిలో చేపల వేటకోసం పడవల్లో మత్స్యకారులు.. చేపల వేటకు వచ్చే పక్షుల సందడి..జలకళతో వంపులు తిరుగుతూ ప్రవహిస్తోంది ప్రాణహిత. తెల్ల ఇసుక మడుగుగా స్థానికులు పిలుచుకునే ఈప్రాంతంలో నది అందాలతో హొయలు పోతున్నట్లుగా కనిపిస్తుంది.

వివాదం.. పరిష్కారం.

తెలంగాణ, మహారాష్ట్రలకు ప్రాణహిత నది సరిహద్దుగా ఉంది. దీంతో తలాయి వద్ద ఇరు ప్రాంతాల ప్రజలకు వివాదం నెలకొంది. చేపలు పట్టడంపై ఇరు గ్రామాల ప్రజలు కొన్నేళ్ల క్రితం అభ్యంతరం తెలిపారు. కానీ ఈవివాదం ఇరు ప్రాంతాల పెద్దమనుషుల జోక్యంతో పరిష్కారమైంది. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమస్య పరిష్కారంతో ఇరు ప్రాంతాల ప్రజలు నదిలో చేపలు పట్టడం ద్వారా ఉపాధి పొందుతున్నారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

అరుదైన సహజ సౌందర్యం ఉన్న తలాయి ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక్కడికి చేరుకోవడానికి రోడ్డు మార్గం ఉంది. ఈప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి కల్పించవచ్చు. ఇక్కడికి ఏటా వందల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. ప్రాణహిత నదికి మహారాష్ట్ర వైపు కమలాపూర్ ఏనుగుల సంరక్షణ కేంద్రం, వెంకటాపూర్ వెంకటేశ్వర ఆలయం, భామ్రాగఢ్ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి.

జీవనోపాధి..

నదులు నాగరికతకు నిలయాలు. నదుల్లోని వనరులను వినియోగించుకుని మనిషి తరాలుగా లబ్ధిపొందుతున్నాడు. తలాయి వద్ద ప్రాణహిత నదిలో చేపలు పట్టడం ద్వారా 150కు పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. తలాయి గ్రామం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరం నీటిమట్టం ఏకాలంలోనూ అడుగంటదు. మహారాష్ట్ర వైపు దేవలమర్రి, తలాయి, సమీప గ్రామాల్లోని ప్రజలు ఎనిమిది నెలల పాటు నదిపై ఆధారపడి జీవిస్తారు. దీనికోసం నదీ తీరంలోని ఇసుకలో తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. పిల్లా పాపలతో ఇక్కడే నివాసం ఉంటారు. నేటికీ సంప్రదాయ పద్ధతులైన నాటుపడవలు, వలల ద్వారా చేపలు పట్టడం విశేషం. ప్రాణహిత నదిలో దొరికే చేపలకు స్థానిక మార్కెట్‌లో డిమాండ్ ఉంది.



నదిలో చేపలు పడుతున్న దంపతులు

చేపల వేటతో ఉపాధి



మహారాష్ట్ర వైపు ఉన్న దేవలమర్రి, తెలంగాణలోని తలాయి గ్రామానికి చెందిన ప్రజలు ఇక్కడ చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నాం. గతంలో ఈప్రాంతంలో వివాదం ఉన్నా ఇరు ప్రాంతాల పెద్దమనుషులు సమస్య పరిష్కరించారు. ఎలాంటి వివాదాలు లేకుండా జీవనోపాధి పొందుతున్నాం.– పాణెం భీమన్న, తలాయి

కుటుంబమంతా ఇక్కడే..



వర్షాకాలం ముగిసిందంటే నదీ తీరానికి వస్తాం. నా భార్య, కొడుకు, కోడలు ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకుంటాం. నెలల తరబడి నదిలోనే జీవనం సాగుతుంది. వర్షాకాలంలో పంటలు వేసే సమయంలో తిరిగి ఊళ్లకు పోతాం. ఉపాధినిచ్చే ప్రాణహితను అదృష్టంలా భావిస్తాం.

– పాణెం శంకర్, తలాయి

పూర్వీకుల నుంచి..



మా కుటుంబాల్లో ఎక్కువ మందికి భూములు లేవు. ఇప్పుడిప్పుడే కొంత మంది ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నా ఎక్కువ మంది నదిపై ఆధారపడి జీవిస్తున్నాం. మాతాతలు ఇక్కడే బతికారు. మేంకూడా ఇక్కడే బతుకుతున్నాం.

– తోకల చిన్నన్న, దేవలమర్రి

ఇసుక లారీకి రూ.80వేల జరిమానా

తాంసి(బోథ్): భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో పెన్‌గంగ నది నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఈ నెల 22న పిప్పల్‌కోటి వద్ద భీంపూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. లారీని స్టేషన్‌కు తరలించి పోలీసులు తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్‌శాఖ అధికారులకు లేఖ రాశారు. శనివారం సాయంత్రం జిల్లా మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక విలువ అంచనా వేశారు. మైనింగ్‌శాఖ జిల్లా ఏడీ ఆర్.రవీందర్ లారీకి రూ.80వేల జరిమానా విధించినట్లు భీంపూర్ ఎస్సై కలీం ఆదివారం తెలిపారు. పెన్‌గంగ నుంచి ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

కలప పట్టివేత



ఇచ్చోడలో పట్టుకున్న కలప, బైక్‌లు

ఇచ్చోడ(బోథ్): మండలంలోని హరినాయక్ తండా వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న కలపను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ రేంజి అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సిరిచెల్మ నుంచి ఇచ్చోడ వైపునకు వస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.27 వేలు ఉంటుందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని, కలపతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో అటవీశాఖ సిబ్బంది సజన్‌లాల్, విశ్వజిత్, నౌసిలాల్, శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోని నాగసముద్రం సమీపంలో రూ.5,649 విలువైన రెండు టేకు దుంగలను పట్టుకున్నట్లు డీఆర్వో సాగరిక తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కలప దుంగలు పట్టుకెళ్తున్న ఓ వ్యక్తిని వెంబడించడంతో పడేసి పారిపోయాడు. వాటిని తాళ్లపేట రేంజికి తరలించామని డీఆర్వో పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో ఎఫ్‌బీవో రహీమొద్దీన్, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ యోగా, కరాటే పోటీలు



యోగాసనాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో జాతీయస్థాయి యోగా, కరాటే చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని పద్మశాలీ భవన్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్, కరాటే అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఎనగందుల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ ప్రారంభించారు. తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడారు. వ్యక్తిగత ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకుంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గెలుపు ఓటములను సమానంగా చూడాలని సూచించారు.

అలరించిన విన్యాసాలు..

క్రీడాపోటీలకు ముందు చిన్నారులు యోగా, కరాటే విన్యాసాలు ప్రదర్శించారు. ఎంతో నేర్పుతో కరాటేను ప్రదర్శించడం ఆకట్టుకుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కరాటే, యోగా క్రీడాకారులు పోటాపోటీగా విన్యాసాలు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవికుమార్, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు మేడి పున్నంచందు, కరాటే మాస్టర్లు తగరపు శంకర్, ఎం.రాజేశ్, విజ్జగిరి రవి, నారాయణ, శిరీష పాల్గొన్నారు.

ఆర్పీల పోరుబాట

- నేడు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సమావేశం
- ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లనున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు
- ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ల నుంచి ముందస్తు అనుమతి..



మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్పీలు

మంచిర్యాలటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు పోరుబాట పట్టనున్నారు. ప్రభుత్వ పరంగా నిధులు కేటాయించాలని, గౌరవ వేతనాలు పెంచాలని, పీఆర్సీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగే తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆర్పీల సంక్షేమ సంఘం సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలు సిద్ధమయ్యారు. సోమవారం మూకుమ్మడిగా హైదరాబాద్‌లో జరిగే యూనియన్ సమావేశానికి వెళ్లేందుకు శనివారం రోజే మున్సిపల్ కమిషనర్ల అనుమతి తీసుకున్నారు. ఈమేరకు అందరికీ సెలవు ఇవ్వాలని వినతిపత్రాలు అందించారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ, వారిలో ఆర్థిక పురోగతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా, ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సర్వేలు, కార్యక్రమాలను నిర్వహణలో పాలుపంచుకుంటున్నా, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నా ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకన్నా ఎక్కువగా బరువు బాధ్యతలను మోస్తున్నా తమకు తగిన గుర్తింపు, శ్రమకు తగిన ఫలితం రావడం లేదని పేర్కొన్నారు. అధికారులు సైతం తమకు ఎలాంటి సంబంధం లేని పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

- జీవో 164 ప్రకారం వీఎల్ఆర్ స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలను ఇవ్వాలనే నిబంధన తొలగించి, సెర్ప్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వీవోఏల మాదిరిగా ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలి.
- గత ప్రభుత్వం అన్నిరంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి ఆర్పీలకు మాత్రమే ఇవ్వలేని, పీఆర్సీ అమలు చేయాలి.
- ఆర్పీలకు కనీస వేతనం రూ.20 వేలు ఉండాలి.
- ఆర్పీలందరికీ గుర్తింపు వచ్చేలా రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్‌కోడ్ అమలు చేసి జాబ్‌చార్ట్ విడుదల విడుదల చేయాలి.
- ఆర్పీలు మరణిస్తే వారి కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల బీమా సౌకర్యం ఇవ్వాలి.
- మూడు నెలలకు ఒకసారి ఈసీల తీర్మానం రద్దు చేయాలి.

'మాలలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి'



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

ఆదిలాబాద్‌రూరల్: మాలలు ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాల సంక్షేమ సంఘం భవనం వద్ద మాలల భవిష్యత్ కార్యాచరణ, జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్, పీవీరావు, కాక చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు ఐక్యం కావాలని ఎప్పటినుంచో నాయకులు కృషి చేస్తున్నా ఫలితం లేదన్నారు. కానీ ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు అనంతరం ఐక్యం కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జేఏసీ చైర్మన్ చన్నయ్య, కన్వీనర్ సర్వయ్య, ఓయూ జేఏసీ నాయకులు మందాల భాస్కర్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ బాలరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాజేశ్వర్, స్వరూప, మేకల మల్లన్న, మధుకర్ పాల్గొన్నారు.

సెలవంటూ వెళ్లిపోయారు..!

- ఈ ఏడాది ప్రముఖుల అస్తమయం
- ఉమ్మడి జిల్లాలో విషాదం

2024 సంవత్సరం కష్ట సుఖాలకు నిలయమైంది. ఎన్నో మంచి కార్యక్రమాలు ఈ ఏడాది జరిగాయి. ఇదే సమయంలో కొన్ని విషాధ ఘటనలూ జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు ఈ ఏడాది పరమపదించారు. గుస్సాడీ నేస్తం కనకరాజు కన్ను మూశాడు, గోండిలిపి యోధుడు అస్తమించాడు. తొలితరం రాజకీయ నేత నర్సారెడ్డి మృతి చెందాడు.

రివైండ్ 2024

నర్సన్నబాపు అస్తమయం..

నిర్మల్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి (నర్సన్న బాపు) 1931 సెప్టెంబర్ 22న జన్మించారు. 1971 నుంచి 1972 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు. 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రిగా పనిచేశారు. 1967 నుంచి 1982 వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా ఈ ఏడాది జనవరి 29న హైదరాబాద్‌లోని తన నివాసంలోనే తుదిశ్వాస విడిచారు.

నేల రాలిన గుస్సాడీ నేస్తం!



కెరమెరి(ఆసిఫాబాద్): గుస్సాడీ అంటేనే కనక రాజుగా భావించే గుస్సాడి రాజును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2024లో కోల్పోయింది. గుస్సాడీ కళానృత్యాన్ని తన సర్వస్వంగా భావించిన కళా ప్రపూర్ణ కనక (గుస్సాడి)రాజు ఈ ఏడాది అక్టోబర్ 24న జైనూర్ మండలంలోని మార్లవాయిలో మృతి చెందాడు. 1981లో అప్పటి ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధి ఏడు నిమిషాల పాటు రాజుతో నృత్యం చేసింది. ఆమెకు నెమలి పింఛాల టోపీని తొడిగించి, కాళ్లకు గజ్జెలు కట్టి, చేతికి దుడ్డు (కర్ర) ఇచ్చిన ఏకైక వ్యక్తి కనక రాజు.

'ఇథనాల్' మంటలు



ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దని ఆందోళన (ఫైల్)

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వద్దంటూ జనవరి 26న నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు రోడ్డెక్కారు. దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్నితో పాటు సమీప గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని 61వ జాతీయ రహదారిపై బైటాయించారు. ఆర్డీవో రత్నకల్యాణిని అడ్డుకుని వాహనంపై దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీపై రైతులు దాడి చేసి, ప్రహరీగోడను కూల్చడంతో పాటు ఒక వాహనానికి నిప్పుపెట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు.

- మండలంలోని రైతులు, యువకులతో పాటు మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఆందోళనలో పాల్గొనడం, పరిస్థితి సీరియస్‌గా మారడంతో జిల్లా అధికారుల సమాచారం మేరకు జనవరి 27న రాష్ట్ర ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు మండల వాసులు ఆందోళన విరమించారు.

గోండి లిపిని ప్రపంచానికి తెలియజేసిన యోధుడు



కోట్నాక్ జంగు (ఫైల్)

నార్నూర్: గోండి లిపి ప్రతులను ప్రపంచానికి తెలియజేసిన యోధుడు కోట్నాక్ జంగు. 2014లో నార్నూర్ మండలంలోని గుంజాలలో గోండి లిపి అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రముఖుడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలను నెలకొల్పి 400 మంది విద్యార్థులకు గోండి లిపిలో విద్యాబోధన చేశారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు సహకారంతో గోండి లిపిలో 2014లో మొదటి వాచకం, 2016లో రెండో వాచకం రాశారు. 2024 సెప్టెంబర్ 23న అనారోగ్యంతో మృతి చెందాడు.

దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేష్

గుడిహత్నూర్(బోథ్): దారి దోపిడీకి యత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ భీమేష్ తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. స్థానిక దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్న బండి సురేష్ నిత్యం వైన్స్‌లో వచ్చిన డబ్బులతో రాత్రి కిలోమీటర్ దూరంలో ఉన్న ఇంటికి వెళ్తుండేవాడు. అది గమనించిన మండలంలోని మన్నూర్‌కు చెందిన ఘుగె రోహన్, జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌కు చెందిన సెంబెటి సాయికుమార్, హమాలీవాడకు చెందిన మీసాల అజయ్, విద్యానగర్‌కు చెందిన ఇల్లెందుల శివప్రసాద్ ఈ నెల 25న రాత్రి జాతీయ రహదారి 44పై సురేష్ వాహనాన్ని నిలువరించి కంట్లో కారం చల్లి డబ్బుల సంచి లాక్కునే ప్రయత్నం చేశారు. బాధితుడు ప్రతిఘటించడంతో తమతో తెచ్చుకున్న కత్తులతో గాయపరిచారు. గట్టిగా అరవడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై మహేందర్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాల ప్రకారం పాత నేరస్తుడైన రోహన్‌పై నిఘా పెట్టగా దోపిడీకి పాల్పడినట్లు నిర్ధారించారు. అతని కాల్‌డేటా ఆధారంగా మిగతా వారిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు స్కూటీలు, దోపిడీకి వాడిన కత్తులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా వారంతా పాత నేరస్తులుగా గుర్తించారు. రోహన్ గతంలో సుపారీ హత్య కేసులో, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. నిందితులపై రౌడీ షీట్ తెరువనున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన వడాయి బాపురావు (52) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కొండపల్లి బస్టాండ్ వద్ద గల చికెన్ సెంటర్‌లో పని చేశాడు. రాత్రి చికెన్ సెంటర్ వ్యర్థాలను ఊరి బయట పడేసి వస్తుండగా కై రిగాం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టి వెళ్లిపోయింది. బాపురావుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రోడ్డు ప్రమాదానికి బొలెరో కారణమని ప్రత్యక్ష సాక్షులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు వాహనం కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు సమాచారం.